

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
సోమవారం 26 ఫిబ్రవరి 2024



ఆసుపత్రి 'స్థాయి' సేవలేవి?

- పేరుకే వంద పడకలు
- 30 పడకల సిబ్బందితో వైద్య సేవలు
- హోదా పెరిగినా సిబ్బంది అంతంతే
- అరకొర వైద్య సేవలతో అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



బెల్లంపల్లిలోని వంద పడకల ఏరియా ఆసుపత్రి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 25: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 30 పడకల ఆసుపత్రి నుంచి వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందుకు అనుకూలంగా భవనాన్ని, సామగ్రిని ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. నియోజకవర్గంలోని ప్రజలతో పాటు దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు అరకొర వైద్య సేవలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి స్థాయి పెరిగినా అందుకు తగిన వైద్య సిబ్బందిని నియమించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

● ఖాళీలు ఇవే..

సివిల్ సర్జన్ స్పెషలిస్టులు 8, సివిల్ సర్జన్‌ఆర్ఎంవో 1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 13, డిప్యూటీ సివిల్‌సర్జన్ 3, డిప్యూటీ డెంటల్‌సర్జన్ 1, ఫిజియోథెరపి 1, హెడ్‌నర్సు 3, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ 1, హెల్త్ ఇన్‌స్పెక్టర్ 1, స్టాఫ్‌నర్సు 16, నర్సింగ్ సూపరింటెండెంట్ 2, జూనియర్ అనలిస్టు 1, ఫార్మాసిస్టు గ్రేడ్ 1, ఆఫీస్ సూపరింటెండెంట్ 1, సీనియర్ అసిస్టెంట్ 2, ల్యాబ్ టెక్నీషియన్ 3, రేడియోగ్రాఫర్ 1, డార్క్‌రూం అసిస్టెంట్ 1, ఏఎన్ఎం 2, థియేటర్ అసిస్టెంట్ 2, జూనియర్ అసిస్టెంట్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రతిపాద నలు పంపినా మంజూరు కాలేదు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఆసుప త్రికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా హోదా పెరిగిన ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

● మెరుగుపడని సేవలు

బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సేవలు మెరుగుపడలేదు. నియోజకవర్గ ప్రజలకు ఈ ఆసుపత్రే పెద్ద దిక్కుగా ఉంటుంది. రోజు ఈ ఆసుపత్రికి 200 నుంచి 300ల వరకు ఔట్ పేషెంట్‌లు వస్తున్నారు. అంతేకాకుండా ప్రసవాల కోసం గర్భిణీలు అడ్మిట్ అవుతారు. 30 పడకల వైద్య సిబ్బందితోనే ప్రస్తుతం సేవలందిస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరతతోపాటు పలు సమస్యలు వేధిస్తున్నాయి. రోగులతో వచ్చే సహాయకులకు ప్రత్యేక వార్డు లేకపోవడం, గైనిక్ వార్డు, పీడియాట్రిక్ వార్డులతో పాటు బ్లడ్ స్టోరేజీ కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఆసుపత్రి వెనుక కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పశువులు ఆసుపత్రి ఆవరణలోకి వస్తున్నాయి. జనరేటర్‌కు గది లేకపోవడం, ఆసు పత్రికి వచ్చిన రోగుల వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ షెడ్డు అందుబాటులో లేదు. పోస్టుమార్టం గది లేకపోవడం, మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్లు కూడా లేవు.

● హోదా పెరిగినా... అరకొర సిబ్బంది...

ఆసుపత్రి స్థాయి హోదా పెరిగినా అందుకు తగినట్లుగా వైద్య సిబ్బందిని నియమించలేదు. ఫలితంగా స్థాయికి తగిన సేవల్లో లోపం ఏర్పడుతుందనే విమర్శలు వస్తున్నాయి. ఆసుపత్రి హోదా పెరిగినప్పటి నుంచి వైద్యులను నియమించలేదు. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిలో ఆరుగురు రెగ్యులర్ వైద్యులు, ముగ్గురు కాంట్రాక్టు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి స్థాయికి అనుకూలంగా పదుల సంఖ్యలో వైద్యులు అవసరం ఉన్నా భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.


సరిగ్గా తలుపులు కూడా లేని పోస్టుమార్టం గది

డాక్టర్లను నియమించాలి


- మొండయ్య

దవాఖానాకు సరిపడే విధంగా డాక్టర్లు లేరు. దవాఖానాకు రోజుకు ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. దవాఖానా పెద్దగా చేసిండ్రు కానీ కొత్త డాక్టర్‌లను నియమించలేదు. దవాఖానాకు వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా మంచి వైద్యం అందించేలా చూడాలి.

ప్రతిపాదనలు పంపించాం


- రవి, ఆసుపత్రి సూపరింటెంటెంట్

ఆసుపత్రిలో 30 పడకలకు సంబంధించిన వైద్య సిబ్బందే ఉన్నారు. అయినప్పటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. వంద పడకలకు సంబంధించి ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తే మరింత మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాను


- గడ్డం వినోద్, ఎమ్మెల్యే

ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాను. గత ప్రభుత్వం ఆసుపత్రిని నిర్మించింది కానీ వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. త్వరలోనే పూర్తిస్థాయిలో ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకం జరిగేలా చూస్తాను. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అరెస్టు

చెన్నూరు, ఫిబ్రవరి 25: రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ గడల తిరుపతిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్టు సీఐ రవీందర్ తెలిపారు. శనివారం రాత్రి మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపి కంకణాల దేవేందర్‌రెడ్డి, సైఫ్‌లను ఢీ కొనడంతో ఇద్దరూ మృతి చెందారని సీఐ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

చెన్నూరు, ఫిబ్రవరి 25: చెన్నూరు వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాదిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి అన్నారు. ఒత్కులపల్లి గ్రామానికి చెందిన మృతుడు దేవందర్‌రెడ్డి కుటుంబాన్ని, చెన్నూరు పట్టణం లైన్ గడ్డకు చెందిన సైఫ్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాదిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

నేడు జాతర దుకాణాల వేలం

చెన్నూరు, ఫిబ్రవరి 25: వచ్చే నెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కత్తరసాల మల్లికార్జున స్వామి ఆలయంలో దుకాణాల సముదాయాల నిర్వహణకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

గాంధారిఖిల్లాకు పర్యాటక గుర్తింపు తీసుకువస్తా


ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 25: గాంధారి ఖిల్లా ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం గాంధారి ఖిల్లా జాతర ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా నాయక్‌పోడ్, గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. ఒడ్డెర, సామంత రాజులు పాలించిన ప్రాంతమైన బొక్కలగుట్ట గాంధారి ఖిల్లా రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన విశిష్టతను కలిగి ఉందన్నారు. నాయక్‌పోడ్, గిరిజనుల ఆరాధ్య దైవమైన గాంధారి మైసమ్మను రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు పెద్ద ఎత్తున జాతరను నిర్వహిస్తారని, ఈ ప్రాంతం ఎన్నో ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక ప్రాంతంతోపాటు జాతరకు పూర్తి వసతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసుల కోరిన కోరికలు తీర్చే దేవతగా బావిస్తారని అన్నారు. జాతరకు తరలివచ్చే భక్తులకు విద్యుత్, రోడ్లు, మంచి నీటి సౌకర్యం, భక్తుల సహాయార్థం షెడ్లు నిర్మించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జాతర కోసం రూ.5 లక్షలు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం జాతర లోపు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వివేక్‌ను నాయక్‌పోడ్‌లు సన్మానించారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆదివాసి నాయక్ పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ దయనేని రమేష్, కమిటీ సభ్యులు రాజశేఖర్, అనిల్, మారుపాక రాజయ్య పాల్గొన్నారు.

నాయకుల పూజలు

మందమర్రి టౌన్: గాంధారి మైసమ్మ జాతరకు మందమర్రికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. భీమన్న దేవుని వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మందమర్రికి చెందిన నాయకులు సొత్కు సుదర్శన్, బండి సదానందం యాదవ్, మంద తిరుమల్, ఎండి ఇసాక్, పోలు శ్రీనివాస్, ఇస్సాక్, జావేద్‌ఖాన్, కడాల శ్రీనివాస్, జమాల్పురి నర్సోజీతో పాటు కడారి జీవన్ పాల్గొన్నారు. ఆదివారం కావడంతో కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఖిల్లా ప్రాంతమంతా కూడా భక్తులతో జనసంద్రంగా మారింది.

వైభవంగా సత్యదేవుడి రథోత్సవం


రథోత్సవంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు


కలమడుగులో నరనారాయణ స్వామి రథోత్సవం

దండేపల్లి, ఫిబ్రవరి 25: గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం తెల్లవారు జామున సత్యదేవుడి ప్రధానాలయంలో వేడుకలను అంగరంగ వైభవంగా ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చక బృందం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు గోవర్ధన రఘుస్వామి, సంపత్‌స్వామి, ఆలయ వేద పండితులు దుద్దిళ్ల నారాయణ శర్మలు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టు ప్రదర్శన చేశారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఉత్సవ విగ్రహాలతో ఆలయ అర్చకులు, సిబ్బంది రంగులు చల్లుకుంటు ఆనందోత్సవ మధ్య నృత్యాలు చేశారు. ఉదయం 10గంటలకు సప్తాహం కార్యక్రమం ముగిసింది. రాత్రి 7గంటలకు స్వామివారికి పుష్పాభిషేకం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాల వేడుకలు ముగిశాయి.

నరనారాయణ స్వామి రథోత్సవం

జన్నారం, ఫిబ్రవరి 25: మండలంలోని కలమడుగులో నరనారాయణ స్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కుంకుమ పూజలు, యజ్ఞాలు నిర్వహించగా, ఆదివారం రథో త్సవంతో పాటు జాతర నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


కత్తెరసాల మల్లన్న ఆలయంలో బోనాలు

కత్తెర సాలలో ఘనంగా బోనాలు

చెన్నూరు : కత్తెరసాల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం మల్లన్నకు ఘనంగా బోనాలు పోశారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించి సహపంక్తి బోజనాలు చేశారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దపల్లి టికెట్ మాదిగ కులస్తులకు ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న మాదిగ ఐక్యవేదిక నాయకులు

నస్పూర్, ఫిబ్రవరి 25: పెద్దపల్లి పార్లమెంట్ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు మాదిగ అభ్యర్థులకే కేటాయించాలని మాదిగ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పార్లమెంట్ స్థాయి మాదిగ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మాదిగలను చిన్న చూపు చేసే పార్టీలను పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ ఎన్నికల వరకు ఓడించే విధంగా తాము ప్రయత్నాలు చేస్తామన్నారు. మాదిగలపై వివక్షను పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కొనసాగుతుందని, రాజకీయంగా ఎదగనీయకుండా కుట్రలు జరు గుతున్నాయన్నారు. ప్రధాన పార్టీలు మాదిగలను ఓట్లేసే యంత్రాలుగా మాత్రమే చూస్తున్నాయని, తమకు రాజకీయ అవకాశాలు దక్కకుండా చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో మాదిగలు ఉన్న ప్పటికీ మభ్యపెడుతూ ప్రాధాన్యం తగ్గిస్తూ వస్తున్నాయన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మాదిగలకు మొండి చేయి చూపారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో మాదిగలకు అవకాశం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మీయ సమావేశంలో మాదిగ ఐక్యవేదిక నాయకులు మామిడిపల్లి బాషయ్య, రేగుంట చంద్రశేఖర్, మల్లేష్, పాపయ్య, రాజారాం, బోసు, సదానందం, కొండ్ర లింగయ్య, కొప్పర్తి రాం, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో కొబ్బరికాయల కొరత

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 25: మందమర్రి పట్టణంలో కొబ్బరికాయల కొరత ఏర్పడింది. సమ్మక్క సారలమ్మ జాతరతో పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి బెల్లం బంగారం సమర్పించుకున్నారు. అలాగే ఆది వాసీల గాంధారి ఖిల్లా జాతర ప్రారంభమైంది. దీనికి కూడా పెద్ద సం ఖ్యలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ మొక్కులు చెల్లించుకున్న వారు ఆదివారం నివాసాల్లో తిరువురి సమ్మక్క సారలమ్మ మొక్కులను కొబ్బరికాయలు కొట్టి చెల్లించారు. దీంతో మార్కెట్‌లో కొబ్బరికాయలు లభించడం లేదు. అక్కడక్కడ ఉన్నా రూ.25 చొప్పున వాటిని విక్రయిస్తున్నారు.

ఆర్టీసీకి రూ.15 లక్షల ఆదాయం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 25: మందమర్రి ఆర్టీసీ బస్టాండ్ నుంచి 116 ప్రత్యేక బస్సుల్లో భక్తులు మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు తరలి వెళ్లారు. మందమర్రి నుంచే దాదాపు 3 వేల మందికి పైగా తరలి వెళ్లారు. మహాలక్ష్మి కింద 1339 మంది వెళ్లారు. శనివారం నాటికి మందమర్రిలో ప్రత్యేక బస్సుల ద్వారా రూ.12 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. మేడారం నుంచి తిరిగి భక్తులను గమ్యస్థానాలకు చేరవేయడం ద్వారా మరో రూ.50 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిర్మల్, నిజామాబాద్ నుంచి మందమర్రికి ప్రత్యేక బస్సులను కేటాయించారు.

ఎన్ఎస్‌యూఐ యూత్ సెక్రెటరీగా అర్జున్‌కుమార్


నియామక పత్రం అందజేస్తున్న శివసేనారెడ్డి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 25: తెలంగాణ యువజన కాంగ్రెస్ యూత్ సెక్రెటరీగా పట్టణానికి చెందిన మహంత్ అర్జున్‌కుమార్ నియమితులయ్యారు. ఆయ నను నియమిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి అర్జున్‌కు నియామక పత్రం అందజేశారు. అర్జున్ మాట్లాడు తూ నియమించిన శివసేనా రెడ్డితో పాటు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాం గ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్ఎస్‌యూఐ పనిచేస్తుందని తెలి పారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడతామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


చెక్కు అందజేస్తున్న స్నేహితులు

నస్పూర్, ఫిబ్రవరి 25: సంఘమల్లయ్య పల్లెకు చెందిన నాంపల్లి వేణు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శ్రీరాంపూర్‌లోని శారద శిశుమందిర్ 2000-2001 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు విరాళాల ద్వారా రూ. 58వేల చెక్కును ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. పాఠశాలలో చదువుకున్న తోటి స్నేహితులు అందరూ కలిసి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని రూ.58వేల రూపాయలను సేకరించారు. వాటిని చెక్కు రూపంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. మిత్ర బృందం కళ్యాణం రవి, తాజొద్దీన్, నైతం విజయ్, రఫీక్‌ఖాన్, గోపు సురేందర్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చాలి

చెన్నూరు, ఫిబ్రవరి 25: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి విద్యావ్యవస్థను మెరుగు పర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయా లన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ దశాబ్ద కాలం వెనక్కి వెళ్లిందన్నారు. మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ పేరిట నిధుల ఖర్చు కంటే ఉన్న పాఠశాలలను మెరుపర్చడం ఉత్తమమన్నారు. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో బోధన కుంటు పడుతుందన్నారు. మన ఊరు- మన బడిలో మంజూరైన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొట్టె నాగరాజు, మండల నాయకులు దుర్గం చందు, అట్టెం రవి, టాప్రే సంతోష్ పాల్గొన్నారు.

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి
అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులు గా చేరాలనుకుంటూన్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు ప్రతిక అందే ఏర్పాటు చేస్తారు
పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు
మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

'రాజకీయాల్లో కక్ష సాధింపు ఉండవద్దు'

మావల, ఫిబ్రవరి 25: రాజకీయ నాయకుడికి కక్ష సాధింపు ధోరణి ఉండ కూడదని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత అందరూ సమానమని, అభివృద్ధి చేయా లని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండ సాంగి గ్రామంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈజీఎస్ పథకం కింద మం జూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఆదివారం పనులను ప్రారంభించారు. ఇందులో కిషన్, కొండూరి రవి, ముఖీమ్, సుదర్శన్, గజానంద్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో తాంసి విద్యార్థిని

తాంసి: జిల్లాస్థాయిలో జరిగిన నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ క్విజ్ పోటీలో తాంసి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని బిందుజకు ద్వితీయ బహుమతి వచ్చింది. ఈ బహుమతిని ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అందజేశారు. కాగా బిందుజను ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

కోలాం సేవా సంఘం ఎన్నిక

భీంపూర్, ఫిబ్రవరి 25: భీంపూర్ మండల ఆదిమ గిరిజన కోలాం సేవ సంఘాన్ని ఆదివారం అర్లి (టి) అనుబంధ గ్రామం శాంతినగర్‌లో కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా ఆత్రం బేరు, అధ్యక్షుడుగా గుంజాల చెందిన ఆత్రం పైకు, ప్రధాన కార్యదర్శిగా త్రం జనార్ధన్, ఉపాధ్యక్షుడిగా రామారావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

- గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్
- చిల్కూరి లక్ష్మినగర్‌లో సంత్ రవిదాస్ జయంతి



హీరాసుక్క ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



సంత్‌రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25: ఆధునిక యుగంలో ఆదివాసి సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించాలని, అవి ఎంతో గొప్పవని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం హీరాసుక్క జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ ఎదుట గల హీరాసుక్క ఆలయంలో పూజలు చేశారు. ఆదివాసీల సంస్కృతికి అనుగుణంగా పూజలు చేస్తూ జెండాను ఆవిష్క రించారు. అనంతరం రాంజీగోండు, కుమ్రంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడు తూ దేశంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని తెలిపారు. వాటిని భావితరాలకు అందించేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభు త్వం కూడా హీరాసుక్క జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసు కోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హీరాసుక్క జయంతిని నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హీరాసుక్క జాగృతి నాయకులు సిడాం రాంకిషన్, మెస్రం కృష్ణ, గేడం జనార్ధన్, గేడం మనోహర్, ఆదివాసీ పర్ధాన్ సేవా సంఘం అధ్యక్షుడు దుర్వ నగేష్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మహాపురుషుడు.. సంత్ రవిదాస్

ఆదిలాబాద్ అర్బన్: మహాపురుషులు మన మధ్య లేకున్నా.. వారి ఆలోచన ద్వారా ఎల్లప్పుడు వారు మనతోనే ఉంటారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా స్థానిక చిల్కూరి లక్ష్మినగర్‌లో నిర్వహిం చిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తి తన ఆలోచనల ద్వారా సమాజాన్ని ఉత్తేజపరుస్తూ తన మాటల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చిన మహా పురుషుడు సంత్‌రవిదాస్ అని అన్నారు. టెక్నాలజి, సాంకేతికత ఉన్న ఈ రోజు ల్లో ఒక విషయాన్ని తెలుసుకోవడం గాని ఒక విషయాన్ని నలుగురికి చేరవేయ డం అతి సాధారణమైన అంశం.. కానీ ఆయన కాలంలో ప్రజల్ని చైతన్య వంతు లను చేయడానికి ఆయన పడిన శ్రమ వృధా కాలేదన్నారు. అందరికీ విద్య, ఆధ్యాత్మిక ఆయన ద్వారా ఎంతో మందికి మార్గదర్శనాన్ని చేశాయన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల అనంతరం అర్హులందరికి ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద ఇళ్లను ఇచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో గౌరవ అధ్య క్షుడు దాదారావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రఘునాథ్ ఇట్కరే, గాయక్వాడ్ సంజయ్, సంతోష్ వింకరే, రాజుకదం, సందీప్ జంజల్కర్, జిల్లా నాయకులు మహేందర్, జోగురవి, పోచ్చన్న, ముకుంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రవిదాస్ నవలలు సమాజాన్ని కదిలించాయి


సంత్ రవిదాస్ 647పుణ్యతిథి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణం లోని స్థానిక చిల్కూరి లక్ష్మినగర్‌లోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. అనంతరం సంత్ రవిదాస్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేశారు. అనంతరం మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ మానవహక్కులు సమానత్వంపై సంత్ రవిదాస్ నవలలు రచనలు యావత్ సమాజాన్ని కదిలించాయన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సమాజ ఔన్నత్యానికి ఆయన చూపిం చిన స్ఫూర్తి మరువలేనిదని ఆయన కొనియాడారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో
జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నేరడిగొండ, ఫిబ్రవరి 25: ఈనెల 21 నుంచి 25 వరకు బిహార్‌లోని పట్నాలో 41వ జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ 23-24 బాలబాలికల పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఫైనల్‌లో కేరళ జట్టుపై ఒక్క రన్ను తేడాతో రాష్ట్ర జట్టు ప్రథమ స్థానం కైవసం చేసు కుంది. ఇందులో జిల్లా నుంచి బాలురలో అఖిల్, బాలికల నుంచి డి.శిరీష, ఎం.అలేఖ్య, బి.అనితలు కోచ్ స్నేహ ఆధ్వర్యంలో బంగారు పతకాలు సాధిం చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ జాదవ్ అనిల్, ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగా ధర్, జిల్లా ఎస్ఐఎస్ కోచ్ ఓ.అఖిల, అసోసియేషన్ సభ్యులు, జిల్లా పేట ప్రెసిడెంట్ సెక్రెటరీలు వారిని అభినందించారు.



















ఉపాధ్యాయుల పదోన్నతుల్లో

సంక్షోభాన్ని తొలగించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

ఏసీసీ, ఫిబ్రవరి 25: పదోన్నతుల్లో ఎదురవుతున్న సంక్షోభాన్ని తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు వెంకట్, శాంతికుమారి అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెం టనే మంజూరు చేయా లని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరిం చాలని, 317జీవో బాధి తులకు న్యాయం చేయా లని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్ సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకా రం సమాన పనికి సమాన వేతనం చెల్లిం చాలన్నారు. ఉపాధ్యా యులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కా రానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సర్వీసును క్రమబద్దీకరిం చాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు గొళ్ల రామన్న, గుర్రాల రాజవేణు, చక్రపాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- మగిసిన సమ్మక్కసారలమ్మ జాతర
- వ్యర్థాలను తొలగించని పారిశుధ్య సిబ్బంది
- వెదజల్లుతున్న దుర్గంధం

ఏసీసీ, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో సమ్మక్క సారలమ్మ జాతర వైభవంగా జరిగాయి. అయితే భక్తులు వదిలివెళ్ళిన వ్యర్థాలతో జాతర ప్రాంతాలు చెత్తతో నిండిపోయాయి. మంచిర్యాల గోదావరి తీరంలో ఈ నెల 21 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించిన సమ్మక్క-సారలమ్మ జాతర శుక్రవారం ముగియడంతో భక్తులు ఇళ్లకు చేరుకున్నారు. జాతర ముగిసినప్పటికి గోదావరి నది తీరంలో, గోదావరి రోడ్డులో జాతరకు వచ్చిన భక్తులు బస చేసిన ప్రాంతాల్లో వారు పడేసిన చెత్త పేరుకు పోయి కంపు కొడుతోంది. పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, కోళ్లు, మేకల మాంసం వ్యర్థాలు, పడేసిన ఆహార పదార్థాలు ఇతర వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. జాతర ప్రారంభానికి ముందు నుంచే పాఠశాల విద్యాశాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో సమ్మక్క-సారలమ్మ జాతరను పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికి ప్రజల్లో మార్పు రాలేదు. జాతరలో ప్రజలు వదిలేసిన వ్యర్థాలను మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది తొలగించలేదు. కోళ్లు, మేకల మాంసపు వ్యర్థాలు, ఎముకలు కుళ్లిపోయి కంపు కొడుతున్నాయి. భక్తులు గుడారాలు వేసుకోవడానికి ఉపయోగించిన కొయ్యలు,



గోదావరి పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

కవర్లు, కూర్చోవడానికి వాడిన చాపలు, గుడారాలకు కట్టుకోవడానికి వాడిన గుడ్డలు, వంట చేసుకోగా మిగిలిన కట్టెలు, బొగ్గు, కొబ్బరి పెంకులు తదితర వ్యర్థాలతో జాతర జరిగిన ప్రాంతం నిండిపోయింది.

-పారిశుధ్య పనుల్లో వైఫల్యం

మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులను సజావుగా నిర్వహించడంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. నదీ తీరంలో, జాతర జరిగిన ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాల్సి ఉండగా అధికారులు అలసత్వం వహించారు. త్వరలో శివరాత్రి పండుగ రానున్నందున జిల్లాతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా భక్తులు పెద్ద ఎత్తున గోదావరి నదిలో స్నానాలు ఆచరించేందుకు వస్తారు. నదీ తీరం అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వెదజల్లుతున్నందున భక్తులు ఇబ్బందులు పడుతారు. పారిశుధ్య పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదివాసీల సంస్కృతీ,సంప్రదాయాల పరిరక్షణకు కృషి

సిర్పూర్(యు), ఫిబ్రవరి 25: ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు జాతీయస్థాయిలో ప్రత్యేక కృషి చేస్తామని రాష్ట్ర గోండిధర్మకోయ పున్నెం ప్రధాన కార్యదర్శి ఆత్రంఆనంద్‌రావు అన్నారు. ఆదివారం మహారాష్ట్ర గోండ్యా జిల్లాసాలుకస తాలుక పోరోపాటార్ ధనేగాంలో నాలుగురోజులుగా జాతీయ గోండిధర్మ సమ్మేళనం కొనసాగింది. ఈకార్యక్రమానికి దేశంలోని 18రాష్ట్రల నుంచి గోండి ధర్మ గురువులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు, సభ్యుల బృందం ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలోని ఆదివాసీల ఐక్యత కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు. గోండిధర్మం కోసం దేశ జనగణనలో భాగంగా ఆదివాసీల కోసం గతంలోఉన్న ధర్మకోడ్‌ను చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈవిషయంపై కేంద్రప్రభుత్వానికి విన్నవించామన్నారు. దేశంలో ఆదివాసీలపై జరుగు తున్న దాడులను ఖండించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ కుంజం, దేవ్‌కుమార్, కాసీనాథ్ గోండ్, తెలంగాణ నుంచి మడావి శేశరావు, సిడాం మారు, కనకరమేష్, కనక యశ్వంత్‌రావు, కనక హన్మంత్‌రావు, కనక మానక్‌రావు పాల్గొన్నారు.

కేఎంపీఎల్ సీజన్-2 క్రికెట్ పోటీలు ప్రారంభం

కాసిపేట, ఫిబ్రవరి 25: కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీనియర్ క్రీడాకారుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొంది వెంకట రమణ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆటలపై దృష్టి సారించాలని సూచించారు. టోర్నీ విజేతకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.30 వేల నగదుతోపాటు మెమొంటోలు అందజేయనున్నట్లు తెలిపారు.

టోర్నీలో సన్‌రైజర్స్, స్మార్ట్‌కూల్, ముంబై హీరోస్, బస్టాండ్ బ్లాస్టర్స్, దేవాపూర్ స్టార్స్, మాస్టర్ బ్లాస్టర్స్, గోవా సూపర్ కింగ్స్, పల్లంగూడ టైటాన్స్, రాయల్ చాలెంజర్స్, బ్రేవ్ హార్ట్ సోల్జర్స్ ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి. ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నీలు దోహదపడతాయన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. వైస్‌ఎంపీపీ విక్రమ్‌రావు, బోయిని తిరుపతియాదవ్, దుస్స చందు, నస్పూరి నర్సింగ్, దాసరి శంకర్, మేరుగు శ్రీనివాస్, రాజేష్, స్థానిక క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన క్రీడాకారులు

సంఘ పటిష్టతకు కృషి చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

దండేపల్లి, ఫిబ్రవరి 25: మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని, సంఘ పటిష్టతకు కృషి చేయాలని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు కోరారు. దండేపల్లిలో తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అన్నం సత్యనారాయణ, అధ్యక్షుడిగా బొలిశెట్టి రాజన్న, ఉపాధ్యక్షులుగా మనోహర్, తిరుపతి, గణేష్, ప్రధాన కార్యదర్శిగా పొలంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కుంచె కిషన్, సలహాదారులుగా గంగన్న, సుగుణాకర్, శేఖర్, సంయుక్త కార్యదర్శులుగా నాగన్న, రవి, గణేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కొండు జనార్దన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొలిశెట్టి బుచ్చన్న కోరారు.

సజావుగా టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష

ఏసీసీ, ఫిబ్రవరి 25: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్, లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్ పరీక్ష మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం సజావుగా జరిగింది. ఉదయం నిర్వహించిన పరీక్షలో 513 మంది విద్యార్థులకు గాను 367 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో 513 మంది విద్యార్థులకు గాను 366 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కంట్రోలర్ జర్నల్ ఎగ్జామినేషన్స్ దామోదర్ రావు సందర్శించి, పరీక్ష జరిగిన తీరును పరిశీలించారు.

మందమర్రిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక ఇబ్బందులు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 25: మందమర్రిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మండలంలోని పది గ్రామాలు, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో కలిపి సుమారు లక్ష మందికి పైగా జనాభా ఉన్నారు. కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు డిగ్రీ విద్యకు దూరమవుతున్నారు. మండలంలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మూడు ప్రైవేటు కళాశాలలున్నాయి. ఇంటర్ అనంతరం పేద విద్యార్థులు డిగ్రీ చదవాలంటే మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తుంది. మందమర్రిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. యేటా వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసుకుంటున్నారు. వీరంతా మంచిర్యాలలోని డిగ్రీ కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రస్తుతం మందమర్రిలో ప్రైవేటు డిగ్రీ కళాశాల ఒక్కటే అందుబాటులో ఉంది. ఆర్థిక స్థోమత ఉన్న వారు కళాశాలలో చేరుతుండగా మరికొందరు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇంటర్‌తోనే విద్యను ఆపేస్తున్నారు. మందమర్రిలో ఉన్న ఇంటర్ ప్రభుత్వ కళాశాల డిగ్రీస్థాయికి అప్‌గ్రేడ్ చేయడానికి విశాలమైన గదులు, మైదానం అందుబాటులో ఉన్నాయి. మందమర్రిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఇందుకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి : బచ్చలి ప్రవీణ్‌కుమార్

మందమర్రిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మందమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అన్ని సదుపాయాలు,సౌకర్యాలు ఉన్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 25: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ చొప్పదండికి చెందిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్సై ఎస్ ఉపేంద్రాచారి కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన ముది గంటి రఘుపతి(39) కుటుంబంతో కలిసి చొప్పదండిలోని పడకంటి కృష్ణ ఇంటిలో అద్దెకుంటున్నాడు. ఇంటి యజమాని కృష్ణ దగ్గర రెండు గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసి రఘుపతి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు చెల్లించమని కృష్ణ వేధించాడని ఈనెల19న రఘుపతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనితో ఆయనను చికిత్సకోసం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రఘుపతి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు మంచిర్యాల రైల్వేస్టేషన్

అభివృద్ధి పనులు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 25: మంచిర్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రూ.27 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు, రోడ్డు అండర్ బ్రిడ్జి పనులను ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అమృత్ భారత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 557రైల్వేస్టేషన్లను ఆధునికీకరణకు ఎంపిక చేయగా అందులో మంచిర్యాల రైల్వే స్టేషన్ కూడా ఉంది.

కాగజ్‌నగర్ కేంద్రంగా కూలర్ల తయారీ

- హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాలకు సరఫరా
- మార్కెట్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్న వ్యాపారవేత్త
- వేసవిలో మంచి డిమాండ్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలో ఓం ఫ్యాబ్ ఇండియా కంపెనీ వారు తయారు చేస్తున్న వివిధ రకాల కూలర్లకు మంచి ఆదరణ లభిస్తోంది. మండల కేంద్రానికి చెందిన రాకేష్ అగర్వాల్ ఆటో మొబైల్ రంగంలో ఇంజనీరింగ్ పూర్తిచేసి 2000 సంవత్సరంలో కంపెనీ ప్రారంభించాడు. మొదట్లో అంతంత మాత్రంగానే ఉండగా, క్రమంగా పురోభివృద్ధి చెందుతూ ఒక బ్రాండ్‌లాగా తయారైంది. ఈ కంపెనీలో 2, 3, 4, 5 పీట్ల కూలర్లు అందుబాటులో ఉంటున్నాయి. స్థానికంగానే కాకుండా ఆసిఫాబాద్ జిల్లాతో పాటు మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు కూడా సరఫరా చేస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే ధరతో పాటు ఎలాంటి సమస్య వచ్చిన కూడా వెంటన సర్వీసు అందిస్తుండటంతో ఈ కంపెనీ కూలర్లకు గిరాకీ బాగా పెరిగింది. ఒక వైపు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో కూలర్లను కొనుగోళ్లు పెరగనున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూలర్లు



తయారీ యూనిట్‌లో కూలర్ల సామగ్రి

● నలుగురికి ఉపాధి కల్పించేందుకు..

- రాకేష్ అగర్వాల్, యాజమాని, ఓం ఫ్యాబ్ ఇండియా



నేను ఆటో మొబైల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. స్వయంగా చిన్నపాటి కూలర్ల తయారీ కంపెనీ పెట్టాను. తన లక్ష్యం నలుగురికి ఉపాధి కల్పించడం. వేసవి కంటే ముందుగానే ఏటా కూలర్ల గిరాకీ పెరుగుతుంది. వివిధ రకాల డిజైన్లతో చేసిన వాటిల్లో 2, 3, 4, 5 పీట్ల కూలర్లను తయారు చేస్తున్నాం. అందరికి అందుబాటులో ఉండే ధరలతో అమ్మకాలు సాగిస్తున్నాను.

బీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 25: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆదివారం బీఎస్పీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్-వంజీరి ప్రధానరోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు లెండుగురే శ్యాం రావు మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులను ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి దుండగులను అరెస్టు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో బీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించి ఉద్యమబాట పడుతామన్నారు. రాస్తారోకోలో బీఎస్పీ అధికారప్రతినిధి నక్క మనోహర్, రేణికుంట్ల శ్రీనివాస్, షబ్బీర్ హుస్సేన్, తస్లీరు పోచం, సిద్ధం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జైనూరులో భారీ వర్షం

జైనూర్, ఫిబ్రవరి 25: మండలంలోని పవర్‌గూడ, జామ్ని, తదితర గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో చలితీవ్రత మళ్లీపెరిగింది. అదేవిధంగా కోత దశకు వచ్చిన గోధుమ, జొన్న తదితర పంటలకు కొంతమేర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనా భారీవర్షం పడటంతో మూగజీవాల మేతకు పచ్చిగడ్డి దొరుకుతుందని రైతులు అంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసిన ఎంపీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25: పేదల సంక్షేమం కేంద్రప్రభుత్వం అమలుచేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపురావు అన్నా రు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉజ్వల పథకం కిందమంజూరైన వంద మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటి గురించి తెలియక లబ్ధి పొందలేక పోతున్నారన్నారు. వికసిత్ భారత్ పేరిట దాదాపు 45 రోజుల పాటు ప్రచార వాహనాల ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని కారణంగా ఎంతోమంది వాటిని వినియోగించుకోవడం లేదన్నారు. తన తల్లి పడ్డ కష్టాలు దేశంలో ఏ ఒక్క మహిళ పడవద్దనే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఉజ్వల పథకం కింద ఉచితం గా గ్యాస్ సిలీలిండర్లను అందిస్తున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జోగురవి, వేదవ్యాస్, ధోనిజ్యోతి, చిల్కూరిజ్యోతిరెడ్డి, స్వప్న, రేఖ, నందబాయి, సతీష్, ముకుంద్, తదితరులు పాల్గొన్నారు.

● కళ్లకు గంతలతో అయోధ్యకు

వెళ్లడం అభినందనీయం..

ఆదిలాబాద్ అర్బన్: హిందువుల 500ఏళ్ల కల అయోధ్య రామమందిర నిర్మాణాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేరవేర్చారని, రామున్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారని ఎంపీ సోయంబాపురావు అన్నారు. సాహసోపేతంగా ఇద్దరు మెజీషియన్లు కళ్లకు గంతలు కట్టుకుని అయోధ్యకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. ఈ నెల 23న ముచ్చింతల్ నుంచి మెజీషియన్ మురళీజోషి, రామకృష్ణలు అయోధ్యకు కళ్లకు గంతలు కట్టుకుని తమ బైక్ యాత్రను ప్రారంభించారు. కాగా, ఆదివారం వీరి యాత్ర ఆదిలాబాద్ కు చేరుకోగా గోపాలకృష్ణ మఠంలో పీఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి ఎంపీ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సాహసోపేతంగా ఇద్దరు మెజీషియన్లు రామ మందిర దర్శనానికి అయోధ్యకు బైక్ యాత్ర చేపట్టడం వారి భక్తికి నిదర్శనమని అన్నారు. 500ఏళ్ల కల నెరవేరిన వేల ఏదో వినూత్నంగా చేయాలనే ఆలోచనతో తన మిత్రుడు రామకృష్ణతో కలిసి ఈ బైక్‌యాత్రను చేపట్టామని మురళీజోషి తెలిపారు. సాధరణ ప్రజల కంటే వినూ త్నంగా మెజీషియన్లు అయిన తాము ఇలా యాత్ర చేపట్టామని వారు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. యాత్రలో భాగంగా రోజుకు రెండు వందల కిలోమీటర్ల వరకు ప్రయాణం సాగిస్తున్నామని తెలిపారు.



సిరికొండలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ సోయం బాపురావు

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీ

సిరికొండ: సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం ఎంపీ సోయం బాపురావు రూ.8లక్షల నరేగా నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంతోనే మారుమూల గ్రామాల అభివృద్ధి సాధ్యమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మరోసారి నరేంద్రమోదీ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలగంగాధర్, వైస్ ఎంపీపీ సాబ్లె సాగరబాయి రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, నాయకులు గోర్పండ్ బాలాజి, బత్తుల అశోక్, గంగాధర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్‌బీనగర్‌లో నిర్మించిన నూతన ఆలయం

ఉట్నూర్, ఫిబ్రవరి 25: మండలకేంద్రంలోని ఎల్‌బీనగర్‌లో సోమవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో అభయాంజనేయ విగ్రహప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నారు. వేద పండితులు విశాల్‌శర్మ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా రుద్రయాగం, పుష్పదాన్య దివాసం, శాయ్యదివాసం, నగర ప్రదక్షిణ, హారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జడ్పీచైర్మన్ జనార్ధన్‌రాథోడ్, ఎంపీసోయంబాపురావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోవ లక్ష్మి, జాదవ్ అనిల్, పాయల శంకర్, తదితరులు వస్తున్నట్లు తెలిపారు.

● నేడు కప్పర్లలో..

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో రూ. కోటీ 50 లక్షలతో నిర్మించిన రామాలయం సోమ వారం ప్రతిష్ఠాపన కానుంది. గత ఆరు మాసాలుగా ఈ ఆలయ నిర్మాణాన్ని వాస్తు ప్రకారం నిర్మించారు. ఆలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలతోపాటు ఆంజనేయస్వామి గణపతివిగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నారు. ఆదివారం 51 జంటలతో మహా యజ్ఞం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. జాతరను కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి మహా అన్నదానం కూడా నిర్వహిస్తున్నట్లు మాజీసర్పంచ్ సదానందం పేర్కొన్నారు. కాగా, భక్తులు పెద్దసంఖ్య లో హాజరవ్వాలని గ్రామస్థులు కోరారు.



మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాగర్ అన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించే జాబ్ మేళాలో వివిధరంగాలకు చెందిన సుమారు 50బహుళజాతి కంపెనీలు రానున్నాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీటీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నాయకుల హర్షం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25: జీవో నెం.317 సమస్యపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు పట్ల టీఎస్‌యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లాఅధ్యక్ష, ప్రధానకార్యదర్శి శాంతికుమారి, ఇందురావ్ మాట్లా డుతూ జీవో నం.317ద్వారా అమలు జరిపిన ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయడం కోసం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి అధ్యక్షతన ఉపసంఘం ఏర్పాటు చేయడం సంతోషమన్నారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయండి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25: జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించే సేవాలాల్ జయంతిని జయప్రదంచేయాలని ఉత్సవకమిటీ ప్రధానకార్యదర్శి శివప్రసాద్‌నాయక్ కోరారు. జిల్లాకేంద్రంలోని ప్రేమలాగార్డెన్‌పక్కన మైదానంలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లానలుమూలల నుంచిపెద్దసంఖ్యలో హాజరైవిజయవంతంచేయాలని కోరారు.

10న జరిగే సభను..

వాంకిడి, ఫిబ్రవరి 25: నాగ్‌పూర్‌లో మార్చి10న కార్పొరేట్-ఫాసిజానికి వ్యతిరేకంగా ఆల్‌ఇండియా యాంటీఫాసిస్ట్ వ్యతిరేకసభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)రెడ్‌స్టార్ జిల్లాకార్యదర్శి తిరుపతికోరారు. మండలంనుంచి విద్యార్థులు, యువత, మేధావులు, కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనికోరారు. దయాకర్,భీంరావు,సంతోష్,గౌరయ్య,సదాశివ్ పాల్గొన్నారు.

నేడు పవర్‌గూడలో 'ఉపాధి' పనులు ప్రారంభం

జైనూర్, ఫిబ్రవరి 25: జాతీయ ఉపాధి హామీ పనులను నేడు సోమవారం పవర్‌గూడలో ప్రారంభిస్తామని, కూలీలం దరూ సకాలంలో రావాలని ఏపీవో నగేష్ తెలిపారు. ఇది వరకే గ్రామపంచాయతీలో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా కూలీలకు సమాచారం అందించామన్నారు. కూలీలు గమనించి తప్పక పనులకు రావాలని ఆయన కోరారు. అదేవిధంగా నియమ నిబంధనల ప్రకారం పనులు చేసినట్లయితే వారం వారం డబ్బులు మంజూరు చేస్తామన్నారు.

చైర్మన్ పదవి
దక్కేదెవరికో?

- మార్చి 4న చైర్మన్ ఎన్నిక
- పెరుగుతున్న పోటీ
- కౌన్సిలర్లతో రహస్య మంతనాలు
- చక్రం తిప్పుతున్న బీఎస్పీ కౌన్సిలర్



కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 25: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ పదవి ఎవరికి దక్కనుందనే విషయంలో అంతా చర్చించుకుంటున్నారు. గత మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్‌పై కౌన్సిలర్లు గతనెల 25న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ తన పదవి కోల్పోయారు. దీంతో మరోసారి చైర్మన్ పదవిపై ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ ఎన్నికలు కూడా మార్చి మొదటి వారంలో నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్ పార్టీ గెలుచుకోవడంతో చైర్మన్‌గా సద్దాం హుస్సేన్, వైస్‌చైర్మన్‌గా రాచకొండ గిరీష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. 4సంవత్సరాల అనంతరం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టారు. జనవరి 25న మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అవిశ్వాసం నెగ్గగా, ఆర్డీవో ఎన్నికలపై కలెక్టర్‌కు నివేదిక అందించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజుకున్న వేడి గత అసెంబ్లీఎన్నికల్లో కౌన్సిలర్లకు మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్‌పై అసంతృప్తి నెలకొనగా కౌన్సిలందరికీ మాజీమున్సిపల్ చైర్మన్ దస్తగిరి నాయకత్వం వహించారు. ప్రస్తుతం దస్తగిరి బంధువు 19వవార్డు కౌన్సిలర్ షాహీన్‌సుల్తానా కౌన్సిలర్‌గా ఉన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 19వ వార్డు కౌన్సిలర్ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరి పనిచేశారు. అలాగే గతంలో బీఆర్ఎస్ కౌన్సిలర్‌గా ఉన్న రాజేందర్ సైతం అవిశ్వాసం కోసం కృషి చేయడంతో ఇద్దరి పేర్లు రేసులో కనిపిస్తున్నాయి. అలాగే గతంలో ఓసారి కోఆప్షన్ సభ్యుడిగా పనిచేసి ప్రస్తుతం బీఆర్ఎస్ కౌన్సిలర్‌గా ఉన్న మహ్మద్ వలీ సైతం చైర్మన్‌గా అవకాశం వస్తుందనే ఆశతో ఉన్నారు. అలాగే 9వ వార్డుకు చెందిన బీఎస్పీ కౌన్సిలర్ మహ్మద్ మినాజ్ సైతం చైర్మన్ స్థానానికి పోటీ పడుతున్నాడు. మరోపక్క మాజీ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ సమీప బంధువు 14వ వార్డు కౌన్సిలర్ కూడా పోటీలో ఉండొచ్చనే ఊహాగానాలు ఉన్నాయి.

మారుతున్న సమీకరణాలు..

ఇప్పటికే ఆయావార్డుల కౌన్సిలర్లు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తూ మంతనాలు సాగిస్తున్నారు. రహస్యంగా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత చైర్మన్ సద్దాం హుస్సేన్‌ను పదవీచ్యుతుడిని చేసేవరకు కలిసికట్టుగా కౌన్సిలర్లంతా పాల్గొన్న విషయం తెలిసిందే. చైర్మన్‌ను దింపేసిన తర్వాత పరిస్థితులు మారుతున్నాయి. చైర్మన్ బరిలో ఉండేందుకు పోటీ పెరుగుతుండటమే ఇందుకు కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక మార్చి 4న ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతుండటంతో బీఎస్పీ కౌన్సిలర్ మినాజ్ రంగంలోకి దిగి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తనకు మద్దతు పలుకుతున్న కౌన్సిలర్లను కూడగట్టుకొని అడుగులు వేస్తున్నారు. అలాగే ఆయా పార్టీల నాయకుల మద్దతు తీసుకొని చైర్మన్ రేసులో పోటీ పడుతున్నారు. కాగా ఈ సారి ఎవరికి మద్దతు పలుకుతారోనన్నది ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.

తపాల శాఖకు సొంతభవనాలు కరువు

- అద్దె భవనాల్లోనే నిర్వహణ
- అరకొర వసతులు.. తప్పని ఇబ్బందులు

వాంకిడి, ఫిబ్రవరి 25: సుదూరప్రాంతాల నుంచి వచ్చే సమాచారాన్ని గ్రామీణప్రాంతాలకు చేరవేసేందుకు ఏర్పాటు చేసిన తపాలశాఖ కార్యాలయాలు అరకొరవసతులతో కొట్టుమిట్టా డుతున్నాయి. కేంద్ర పరిధిలోని అనేకశాఖల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న కేంద్రప్రభుత్వం తపాలశాఖ కార్యాలయాలకు మాత్రం కేటాయించడంలో నిర్లక్షంగా వ్యవహారిస్తోంది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) క్లస్టర్‌లలో మొత్తం 72బ్రాంచ్‌పోస్ట్ ఆఫీసులు పనిచేస్తున్నాయి. సిర్పూర్(టి) పరిధిలో 30, రెబ్బెన పరిధిలో 8, ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట పరిధిలో 11, వాంకిడి పరిధిలో 8, కాగజ్‌నగర్ పరిధిలో 15 బ్రాంచ్ ఆఫీసులు పనిచేస్తున్నాయి. జిల్లాలో కేవలం రెబ్బెన, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) సబ్‌పోస్ట్ ఆఫీసులకు మాత్రమే సొంత భవనాలు ఉండగా మిగిత మండలాల్లోని బ్రాంచ్‌పోస్ట్ ఆఫీసులు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి.

ప్రతినెల 8నుంచి 10వేల రూపాయల అద్దెచెల్లిస్తున్న ప్రభుత్వం సొంతభవనాల నిర్మాణాలకు మాత్రం నిధులు విడుదల చేయకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, తదితర మండలాల్లోని తపాలకార్యాలయాల్లో అరకొర వసతుల కారణంగా పనిచేసే సిబ్బందితోపాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకపక్క అరకొర వసతులు, మరోపక్కసరిపడ సిబ్బందిలేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తపాల కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు అమలు కావడంతోపాటు సేవింగ్ ఖాతాల వినియోగం పెరగడంతో పోస్ట్ మాస్టర్‌లకు పనిభారం పెరిగింది. దీంతో సకాలంలో పనులు పూర్తి కావడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తపాలశాఖ కార్యాలయాలకు పక్కాభవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.



వాంకిడిలో అద్దెభవనంలో కొనసాగుతున్న పోస్ట్ ఆఫీస్

సొంత భవనాలను నిర్మించాలి..
ఆరిఫ్ - వాంకిడి



తపాలశాఖ కార్యాలయాలకు సొంతభవనాలను నిర్మించాలి. తపాలశాఖ కార్యాలయాలు అద్దెభవనాల్లో నడుస్తుండడంతో వినియోగదారులకు సరైన వసతులులేక ఇబ్బంది పడుతు న్నారు. ఇతరశాఖల వసతుల కల్పనపై దృష్టి పెడుతున్న ప్రభుత్వాలు తపాలశాఖ కార్యాలయాలపై దృష్టిపెట్టడంలేదు. కొన్నేళ్ల నుంచి తపాలశాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. తపాలశాఖ కార్యాలయాలకు పక్కాభవనాలు నిర్మించి వినియోగదారులకు సదుపాయాలు కల్పించాలి.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి..
- మేనబావ పైనే అనుమానాలు..



సంఘటనా స్థలం వద్ద విచారణ చేపడుతున్న పోలీసులు



తలండి నిర్మల(ఫైల్)

పెంచికలపేట, ఫిబ్రవరి 25: మండలంలోని గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మల(26) అనే యువతి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..గుండెపల్లి గ్రామానికిచెందిన తలండి నిర్మల శుక్రవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు రెండురోజులుగా గాలిస్తున్నారు. ఆదివారం వారు వెతుకున్న క్రమంలో గ్రామ సమీపంలోని పంట చేను దగ్గరలో యువతికి సంబంధించి గాజులు, చెప్పులు, రక్తపు మరకలు కనబడ్డాయి. ఈ క్రమంలో వారు ఆ చేనులో ఉన్న బావివద్దకు వెళ్లిచూశారు. అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ చేరుకుని బావిలో ఈతగాళ్లతో వెతికించగా యువతి నిర్మల మృతదేహం లభ్యమైంది. యువతి మృతదేహానికి తలపైన రెండు, మెడపైన ఒక బలమైన గాయాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. సదరు యువతి రెండేళ్ల నుంచి బెజ్జూరు మండలం కోయపెల్లి గ్రామానికి చెందిన మేనబావ రవి అనే యువకుడితో ప్రేమలో ఉన్నట్లు తెలిపారు. యువతి మృతికి అతనే కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతికి గల పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామన్నారు.

ముగిసిన గంగాపూర్ జాతర



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, ఫిబ్రవరి 25: రెబ్బెన మండలం గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శుక్రవారం నుంచి కొనసాగుతున్న జాతర ఆదివారంతో ముగిసింది. ఆదివారం కూడా భక్తుల రద్దీ ఎక్కువగానే కన్పించింది. ముఖ్యంగా ఉదయం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు జాతరలో ఆట వస్తువులు, బొమ్మలు తీర్థ ప్రసాదాలు కొనుగోలు చేసుకొని తిరుగుముఖం పట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరుగకుండా కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



జాతరలో బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని డబ్బా ఎక్స్ రోడ్ వద్ద వెలిసిన సమ్మక్క- సారలమ్మ ప్రాంగణం ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిలువెత్తు బంగారంతోపాటు ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డబ్బా, ధరంపల్లి, ఆడిపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది.



రూ. కోటి ఎక్స్‌గ్రేషియాకు నేడు ఒప్పందం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు గనిలోగానీ, బయటగానీ మరణిస్తే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూనియన్ బ్యాంక్‌ఆఫ్‌ఇండియాతో సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం చేసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో పలుదఫాలుగా యాజమాన్యం, అన్ని బ్యాంకులతో చర్చించగా, యూనియన్‌బ్యాంకు మాత్రమే రూ.కోటి పరిహారం చెల్లించేందుకు ఒప్పుకుందని తెలిపారు. మిగతాబ్యాంకులు కూడా అదే మాదిరిగా చెల్లించేలా కృషి చేస్తామని ఆయన వివరించారు.

కోటి ఎక్స్‌గ్రేషియా ఏఐటీయూసీ ఫలితమే: వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రి టౌన్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు గని ప్రమాదంలో కానీ, బయట ప్రమాదాలకు కానీ గురై మరణిస్తే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూనియన్ బ్యాంకుతో ఒప్పందం జరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదిపూర్తిగా తమయూనియన్ వల్లనే సాధ్యమైందన్నారు. సోమవారం ముఖ్యమంత్రి ఎదుటఒప్పందాలు జరుగుతాయని చెప్పారు. తాము ఎన్నికైన తర్వాత కార్మికులకు మెరుగైన ఆర్థికపరమైన ప్రధాన అంశంపై విజయం సాధించామన్నారు.

బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఫోర్‌మెన్, ఫోర్‌మెన్‌ఇన్‌చార్జిలను బదిలీచేసేందుకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన సింగరేణి సీఎండీ ఎన్‌బలరాంకు లేఖరాశారు. అడ్రియాల ప్రాజెక్ట్‌లో డిప్లొమాకలిగిన ఫోర్‌మెన్, ఫోర్‌మెన్ ఇన్‌చార్జిలు 15ఏళ్లుగా అండర్‌గ్రౌండ్‌లోనే పనిచేస్తున్నారన్నారు. బదిలీలకోసం యాజమాన్యం ఇటీవల సర్క్యులర్ ఇచ్చిందన్నారు. వారినుంచి దరఖాస్తులు స్వీకరించి వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా ఇతరఓసీపీలు, విభాగాలకుబదిలీచేసి, న్యాయంచేయాలని ఆయన కోరారు.

అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకు అవకాశం ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా అవకాశం కల్పించాలని జనరల్‌మజ్దూర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు వివిధ యూనియన్ల నాయకులకు ఆదివారం వినతి పత్రాలు అందించారు. గతంలో అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్ జనరల్‌మజ్దూర్లుగా పదోన్నతి కల్పించారని అన్నారు. కానీయాజమాన్యం ఆ విధానానికి స్వస్తి పలికేందుకు నిర్ణయించుకుందన్నారు. ఈ విషయంలో తాము ఎంతో ఆవేదనతో ఉన్నామని, యూనియన్ నాయకులు సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఇటీవల యాజమాన్యం 108మందికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా అవకాశం కల్పించేందుకు యాజమాన్యం నిర్ణయించిందన్నారు. గతంలో జరిగిన దానికి భిన్నంగా అన్ని కేటగిరీల వారికి సర్ఫేస్ జనరల్‌మజ్దూర్లుగా అవకాశంఇస్తే అండర్‌గ్రౌండ్ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. తాము దీర్ఘకాలంగా పదోన్నతులు లేకుండా మిగిలిపోయామని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో అన్నికేటగిరీలవారికి సర్ఫేస్ జనరల్‌మజ్దూర్లుగా నియమించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చిందని, తమ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని వారు కోరుతున్నారు.



ఐఎన్‌టీయూసీ నాయకులకు వినతిపత్రం అందిస్తున్న జనరల్ మజ్దూర్లు

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: ఐఎన్‌టీయూసీపక్షాన కార్మిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. సీసీసీ-నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బొగ్గుగనుల వేలంలో సింగరేణి యాజమాన్యం పాల్గొనేలా చూడాలని తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. అంతేకాకుండా రిటైర్డ్ కార్మికులకు సీపీఆర్ఎంఎస్‌లో వైద్య ఖర్చుల పరిమితి రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు తదితరాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, పి తిరుపతి, రాజు, ఐ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు అండగా ఉంటా

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: సింగరేణి కార్మికులకు అండగా ఉంటానని పెద్దపల్లి పార్లమెంట్ నాయకుడు, టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్ పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఐఎన్‌టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పెద్దపల్లి ఎంపీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు, సింగరేణి కార్మికులు ప్రధానపాత్ర పోషించి, కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు గరిగే స్వామి, పేరం స్వామి, పిన్నింటి మల్లారెడ్డి, విజయ్ పాల్‌రెడ్డి, ల్యాగల శ్రీనివాస్, తిరుపతి రాజు, శ్రీనివాస్, తిరుపతి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై విక్రం

బెజ్జూరు, ఫిబ్రవరి 25: మండలం కేంద్రంలో కొండ్ర బుచ్చమ్మ-హనుమగౌడ్ జ్ఞాపకార్థం మంచిర్యాల న్యూవవన్ ఆప్టికల్స్ అండ్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో వారి కుమారులు ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం ఎస్సై విక్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్, గోపికృష్ణ, ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, ఫిబ్రవరి 25: 11కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా కౌటాల సబ్‌స్టేషన్ పరిధిలోని గురుడుపేట, కన్నెపల్లి, బోధన్‌పల్లి, కన్కి, యాపల్‌గూడ గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.